1 St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF PEN

సంపుటి : 2 సంచిక : 346 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 14 డిసెంబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు
VOLUME : 02 ISSUE : 346 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 4 December 2025 PAGES : 8 PRICE : 3/-

# 16న మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్‌కు సీఎం రాక

## పోలీసు నియామక పత్రాలు అందజేయనున్న చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 14)

గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 16న రానున్నారు. పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన 6,000 మందికి ఆయన నియామక పత్రాలు అందజేయనున్నారు. ఎంపికైన వారితో పాటు వారి -మిగతా 2లో

# ఎన్నికల్లో పోటీ చేయడంపై నాగబాబు స్పందన

## ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయనని ప్రకటించిన నాగబాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 14)

జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగేంద్రబాబు (నాగబాబు) ప్రత్యక్ష రాజకీయాలపై కీలక ప్రకటన చేశారు. తనకు ఎన్నికల్లో పోటీ చేసే ఉద్దేశం లేదని, పార్టీ కార్యకర్తగా ఉండటంలోనే ఎక్కువ సంతృప్తి ఉందని స్పష్టం చేశారు. ఇటీవల ఉత్తరాంధ్రపై దృష్టి సారించిన ఆయన, -మిగతా 2లో

# దేశంలో అభివృద్ధికి బీజం వేసిన వాజ్‌పేయీ: కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 14)

కడపలో వాజ్‌పేయీ విగ్రహావిష్కరణలో పాల్గొన్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, చిత్రంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు. దేశంలో అభివృద్ధికి బీజం వేసిన నేత మాజీ ప్రధాని వాజ్‌పేయీ అని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ కొనియాడారు. కడప ఎర్రముక్కపల్లి సర్కిల్లో వాజ్‌పేయీ కాంస్యవిగ్రహాన్ని శనివారం రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. సభలో ఆయన మాట్లాడుతూ.. 'వాజ్‌పేయీ భాజపా నేత అయినా అన్నిపార్టీల, వర్గాల అభిమానం చూరగొన్నారు. దేశంలో ఇప్పుడు అమలవుతున్న అనేక పథకాలకు ఆయనే బీజం వేశారు. వాజ్‌పేయీ స్ఫూర్తితో నేడు ప్రధాని మోదీ ఆ సంస్కరణలు అమలు చేస్తూ దేశాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నారు' అన్నారు. వాజ్‌పేయీ దేశ గౌరవ ప్రతిష్ఠలు పెరగడానికి కృషి చేశారని రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ కొనియాడారు. 'వాజ్‌పేయీ విగ్రహాన్ని చూస్తే ఒక ప్రేరణ కలుగుతుంది. సామాన్య ప్రజలు దండం పెట్టుకుని వెళ్తున్న తీరు ఆశ్చర్యంగా ఉంది' అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చెప్పారు. రాష్ట్ర మంత్రి సవిత, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా నేత బీటెక్ రవి ప్రసంగించారు.

# నా ఉన్నతికి కారణం ఉపాధ్యాయులే



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 14)

'నా ఉన్నతికి నా ఉపాధ్యాయులే కారణం. ఏ స్థాయికి వెళ్లినా విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలు, గురువును మర్చిపోకూడదు' అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరి- తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎర్రబాలెం వద్ద ఉన్న డాన్‌బాస్కో తెలుగు మీడియం ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్వర్ణోత్సవ శిలాఫలకాన్ని, ఆధునికీకరించిన సైన్స్ ప్రయోగశాలను ఆయన ప్రారంభించారు. పాఠశాల వ్యవస్థాపకుడు రెవ.ఫాదర్ థామస్ చిన్నప్ప విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి లోకేశ్ మాట్లాడుతూ.. 'చదువుకునే సమయంలో ఎక్కువ సమయం ఉపాధ్యాయులతోనే గడుపుతాం. ఈ రోజు నేను ఈ స్థాయికి వచ్చానంటే ఉపాధ్యాయిని మంజులా మేడం, నారాయణ, రాజారెడ్డి మాస్టార్లు కారణం. ఏ స్థాయికి వెళ్లినా చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సాయం అందించాలి. జీవితంలో విలువలతో కూడిన నిర్ణయాలను తీసుకోవాలి. అన్ని సమస్యలనూ ఒక వ్యక్తి లేదా ఓ వ్యవస్థ తీర్చలేవు. అందరూ కలిసి పనిచేసినప్పుడే ఆశించిన మార్పు వస్తుంది. డాన్‌బాస్కో పాఠశాలను దేశంలోనే అద్భుత పాఠశాలగా తీర్చిదిద్దుతాం. తెలుగు రాష్ట్రాల్లో 35 డాన్‌బాస్కో పాఠశాలలు విద్యతో పాటు విలువలను అందిస్తున్నాయి. ఎయిడెడ్ వ్యవస్థ రద్దయి మూడేళ్లవుతోంది, తమను ఆదుకోవాలని గతంలో ఆ విద్యాసంస్థల ప్రతినిధులు కోరారు. విద్యా శాఖ మంత్రిగా అండగా నిలుస్తాను' అని పేర్కొన్నారు. సెకండరీ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్ కమిషనర్ శ్రీనివాసులరెడ్డి, విజయవాడ బిషప్ జోసఫ్ రాజారావు, ఫాదర్ సంతియాగు థామస్, మంగళగిరి డాన్‌బాస్కో ప్రతినిధి రెక్టర్ ఫాదర్ చిన్నప్ప, పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### బ్రాహ్మణికి పురస్కారం.. భర్తగా గర్వపడే క్షణం: లోకేశ్

బిజినెస్ టుడే....'మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ ఇన్ బిజినెస్' పురస్కారాన్ని నారా బ్రాహ్మణి అందుకోవడంపై ఎక్స్ వేదికగా మంత్రి నారా లోకేశ్ స్పందించారు. "భర్తగా గర్వపడే క్షణం. భవిష్యత్తు గురించి దూరదృష్టి, ఆలోచన, మాటలకంటే చేతల్లో చూపడం ఆమెలోని గొప్ప నాయకత్వ లక్షణాలు" అని లోకేశ్ పేర్కొన్నారు.

# ఆ నియోజకవర్గ ప్రజలు పవన్ కు రుణపడి ఉంటారు: మంత్రి ఆనం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 14)

ఆత్మకూరు అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన పవన్ కల్యాణ్
పవన్‌కు నియోజకవర్గ ప్రజలు రుణపడి ఉంటారన్న మంత్రి ఆనం
జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శ
ఉద్యోగుల బకాయిల్లో రూ.12 వేల కోట్లు చెల్లించామన్న ఆనం

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అడిగిన వెంటనే పవన్ నిధులు మంజూరు చేస్తున్నారని ఆయన ప్రశంసించారు. ఆదివారం నెల్లూరులో మీడియాతో మాట్లాడిన ఆనం, కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరిస్తూ, గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.

ఆత్మకూరు నియోజకవర్గంలోని 10 పంచాయతీ భవనాల నిర్మాణానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిధులు విడుదల చేశారని మంత్రి తెలిపారు. అలాగే, ఆత్మకూరు ప్రాంతీయ ఆసుపత్రిని 250 పడకలకు విస్తరిస్తున్నామని, భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని, కర్నూలులో దేవాదాయశాఖ జోనల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వంపై ఆనం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అవినీతి, అక్రమాలతో అప్పుల్లో ముంచెత్తింది. -మిగతా 2లో

# తగిన చర్యలు తీసుకుంటాం: మెక్సికో సుంకాలపై స్పందించిన భారత్..

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 14)

భారత దిగుమతులపై ఉన్న సుంకాలను 50 శాతానికి పెంచేందుకు మెక్సికో సిద్ధమైన సంగతి తెలిసిందే. ఈ టారిఫ్‌ల పెంపుపై స్పందించిన భారత్.. ఇరుదేశాలకు ప్రయోజనం చేకూరే విధంగా చర్చలు జరుపుతామని పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో తమ ఎగుమతిదారుల ప్రయోజనాలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకునే హక్కు ఉందని భారత అధికారి తెలిపినట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. చైనా, భారత్, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్, ఇండోనేసియాతో సహా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం లేని ఇతర ఆసియా దేశాల నుంచి దిగుమతి చేసుకునే పలు వస్తువులపై సుంకాలను పెంచే విషయంపై మెక్సికో సెప్టెంబరులోనే సెనెట్‌లో ప్రతిపాదనలు ప్రవేశపెట్టింది. అప్పటి నుంచే ఆ దేశంతో భారత్ చర్చలు జరుపుతుందని ఒక అధికారి తెలిపారు. -మిగతా 2లో



# రూ.92 కోట్ల విలువైన నక్సల్ ఆస్తుల జప్తు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 14)

వచ్చే ఏడాది నాటికి దేశాన్ని నక్సల్ రహితంగా మార్చాలన్న లక్ష్యంతో వివిధ దర్యాప్తు సంస్థలు సంయుక్తంగా జరిపిన దాడుల్లో రూ.92 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు కేంద్రం ప్రకటించింది. ఈ చర్యల ద్వారా నక్సలైట్ల ఆర్థిక మూలాలను దెబ్బతీశామంది. వారి సమాచార నెట్‌వర్క్‌లపై కఠినమైన నియంత్రణ చర్యలు తీసుకోవడంతో 'అర్బన్ నక్సలైట్ల'పై మానసికంగా తీవ్ర ప్రభావం చూపగలిగామని ప్రకటనలో పేర్కొంది. దీని ప్రకారం...జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) రూ.40 కోట్లు, రాష్ట్ర అధికారులు రూ.40 కోట్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రూ.12 కోట్ల విలువైన ఆస్తులను జప్తుచేశాయి. 2014లో 126 జిల్లాలు నక్సల్ ప్రభావిత ప్రాంతాలుగా ఉండగా...2025 నాటికి కేవలం 11 జిల్లాలే మిగిలాయి. ఈ ఏడాది సుమారు 317 మంది నక్సలైట్లు అంతమయ్యారు. 862 మంది అరెస్టు కాగా మరో 1,973 మంది తుపాకులను వదిలి లొంగిపోయారు. 2014 వరకు కేవలం 66గా ఉన్న పటిష్ఠ పోలీస్‌స్టేషన్‌ల సంఖ్య పదేళ్లల్లో 586కు పెరిగాయి. అదేవిధంగా నక్సలైట్ల ప్రభావిత ప్రాంతాల్లో కేంద్రం అభివృద్ధి పనులు కూడా చేపట్టింది. రూ.20,815 కోట్ల విలువచేసే 17,589 కి.మీ రోడ్లు వేయించింది. వివిధ ప్రాంతాల్లో బ్యాంకులు, -మిగతా 2లో

# అభివృద్ధి, సంక్షేమంలో రాజీ పడొద్దు

## పోలవరం ఎమ్మెల్యే బాలరాజుతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్




(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 14)

'ప్రజలు అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ వారికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడంలో ఏ దశలోనూ రాజీ పడకూడదు. గెలిచిన ప్రతి ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం విషయంలో ప్రజలకు సంతృప్తి కలిగించేలా పని చేయాలి' అని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల్లో అభివృద్ధితో పాటు పార్టీ కార్యక్రమాల నిర్వహణపై సమీక్షించాలని పవన్‌కల్యాణ్ నిర్ణయించారు. దీనిలో భాగంగా జనసేన ఎమ్మెల్యేలు ప్రతి ఒక్కరితో ఆయన విడివిడిగా (వన్ టూ వన్) భేటీ కానున్నారు. శనివారం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో తొలి సమావేశం నిర్వహించారు. ఏడాదిన్నర కాలంలో పోలవరం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన సమీక్షించారు. పెండింగ్ పనుల గురించి తెలుసుకున్నారు. నియోజకవర్గానికి దక్కిన నామినేటెడ్ పోస్టుల అంశాన్ని ఉప ముఖ్యమంత్రి చర్చించారు. -మిగతా 2లో

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com


## మంత్రి డోలాను కలిసిన జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ముప్పవరపు సుచిత్ర




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 14)

టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం క్యాంప్ కార్యాలయంలో ఆదివారం మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామిని ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ముప్పవరపు సుచిత్ర చౌదరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలు ఆమె మంత్రితో చర్చించారు.

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 14)

అఖిల గాండ్ల తెలికుల సంఘం 2026వ సంవత్సరం క్యాలెండర్ మార్కాపురంలోని శ్రీనివాస థియేటర్ నందు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు భీమవరం సహదేవుడు, గౌరవ అధ్యక్షులు నాగార వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారు పోలచిన లింగయ్య, కోశాధికారి దుగ్గి శ్రీనివాసులు, చింతకుంట్ల, ఉపాధ్యక్షులు వరిగుంట్ల శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి పోలా అల్లూరయ్య , వేములపాటి భాగ్యలక్ష్మి, గౌరవ సభ్యులు గాండ్ల వెంకట రంగారావు, గౌరవ సభ్యులు ముద్దబాటి కృష్ణయ్య, సభ్యులు వరికుంట్ల శ్రీనివాసులు, లారీ ఓనర్ సభ్యులు నాగారం కాశిరావు, గారుగుంటక వెంకటయ్య, వేమలపాటి అల్లూరయ్య, పాల్గొని ఆవిష్కరించారు.

## కొమ్ము పాపయ్య, దొండపాటి కొండయ్యలకు ఆర్థిక సాయం



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, డిసెంబర్ 14)

గొబ్బూరు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన కొమ్ము పాపయ్య, దొండపాటి కొండయ్యలకు చిన్న వయసులోనే పక్షవాతం వచ్చింది. వారి ఇబ్బందులు తెలుసుకొన్న గొబ్బూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి ఏలూరి వెంకటనారాయణ రెడ్డి మానవత్వం చాటుకున్నారు. వారిరువురికి రూ.5 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు.

### మొదటి పేజీ తరువాయి

## ఎన్నికల్లో పోటీ చేయడంపై నాగబాబు స్పందన

శ్రీకాకుళంలో పార్టీ నేతలతో సమావేశమైన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు.

గత కొంతకాలంగా నాగబాబు శ్రీకాకుళంలో తరచూ పర్యటిస్తుండటంతో, ఆయన అక్కడి నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారం ఊపందుకుంది. ఈ ఊహాగానాలకు తెరదించేందుకే ఆయన తన నిర్ణయాన్ని ప్రకటించారు. “నాకు ఎమ్మెల్యేగా పోటీ చేయాలనుకుంటే గత ఎన్నికల్లోనే చేసేవాడిని. వచ్చే ఎన్నికల వరకు ఎందుకు ఆగాలి? ఐదారేళ్ల తర్వాత ఏం జరుగుతుందో ఇప్పుడే ఎలా చెబుతాం?” అని నాగబాబు అన్నారు. జనసేన ప్రధాన కార్యదర్శి కంటే పార్టీ కార్యకర్తగా పిలిపించుకోవడమే తనకు ఇష్టమని ఆయన పేర్కొన్నారు.

ప్రస్తుతం నాగబాబు ఎమ్మెల్సీగా సేవలు అందిస్తున్నారు. గత ఎన్నికల్లో అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలని భావించినా, పొత్తులో భాగంగా ఆ సీటు బీజేపీకి దక్కిన విషయం తెలిసిందే. శ్రీకాకుళంలో ఇప్పటికే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న తరుణంలో, నాగబాబు పోటీ చేస్తారనే ప్రచారం కూటమిలో అనవసర ఇబ్బందులకు దారితీయవచ్చని భావించిన ఆయన, ముందుగానే తన వైఖరిని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ ప్రకటనతో ఉత్తరాంధ్రలో ఆయన పోటీపై వస్తున్న వదంతులకు తెరపడినట్లయింది.

## అభివృద్ధి, సంక్షేమంలో రాజీ పడొద్దు

ఎమ్మెల్యేలే సమస్యల్ని గుర్తించి, పరిష్కరించాలి

‘అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం నిర్దేశిత లక్ష్యంతో ముందుకు వెళ్తోంది. ఎమ్మెల్యేలూ ఆ దిశగా వెళ్లాలి. ఐఎస్ జగన్నాథపురం పర్యటనకు వచ్చినప్పుడు తిమ్మనకుంట- గవరవరం రోడ్డు లేక రెండు దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్న అంశాన్ని ఒక మహిళ నా దృష్టికి తీసుకువచ్చారు. అలాంటి సమస్యలను ఎమ్మెల్యేగా గుర్తించి పరిష్కరించేలా పని చేయాలి’ అని పవన్‌కల్యాణ్ ఎమ్మెల్యేతో అన్నారు. కూటమి ధర్మాన్ని అనుసరిస్తూనే జనసేన పార్టీ కార్యక్రమాలు నియోజకవర్గంలో విస్తృతం చేయాలని చెప్పారు. పోలవరం నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యే బాలరాజు ఉప ముఖ్యమంత్రికి అందించారు. సమావేశంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు పాల్గొన్నారు.

## ఆ నియోజకవర్గ ప్రజలు పవన్ కు రుణపడి ఉంటారు: మంత్రి ఆనం

అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోతే పట్టించుకోలేని దుస్థితిని చూశాం. గత ప్రభుత్వం ఉద్యోగులకు రూ.32 వేల కోట్ల బకాయిలు పెడితే, మా కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలోనే రూ.12 వేల కోట్లు చెల్లించింది” అని తెలిపారు. రూ.120 కోట్లతో సోమశిల అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. జగన్ మాయలో పడి సీనియర్ నేత బొత్స సత్యనారాయణ మాట్లాడటం దురదృష్టకరమని ఆనం వ్యాఖ్యానించారు.

## తగిన చర్యలు తీసుకుంటాం: మెక్సికో సుంకాలపై స్పందించిన భారత్..

అక్కడి భారత రాయబార కార్యాలయం సెప్టెంబరు 30నే ఆర్థిక మంత్రిత్వశాఖ వద్ద ఈ విషయాన్ని లేవనెత్తిందని వెల్లడించారు. కొత్తగా ప్రతిపాదించిన సుంకాల నుంచి భారత ఎగుమతులకు ప్రత్యేక రాయితీలను కల్పించాలని కోరినట్లు పేర్కొన్నారు.

‘మెక్సికోతో భాగస్వామ్యానికి భారత్ ఎంతో విలువ ఇస్తుంది. ఇరుదేశాల్లోని వ్యాపారులు, వినియోగదారులకు ప్రయోజనం చేకూరేలా స్థిరమైన వాణిజ్యం కోసం కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం’ అని అన్నారు. ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి చర్చలు ప్రారంభించేందుకు చూస్తున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. వాణిజ్య విభాగ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్, మెక్సికో ఆర్థిక ఉపమంత్రి లూయిస్ రోసెండో మధ్య ఉన్నత స్థాయి సమావేశం జరిగినట్లు తెలుస్తోంది. దీనిపై మరిన్ని సమావేశాలు జరగనున్నట్లు సమాచారం. ఇక, దేశీయ ఉత్పత్తులను పెంచడంలో భాగంగా చైనా, భారత్‌తో సహా పలు ఆసియా దేశాలకు చెందిన 1400 వస్తువులపై సుంకాలను 50 శాతం పెంచాలని మెక్సికో నిర్ణయించింది. ఇవి వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

## 16న మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్‌కు సీఎం రాక

కుటుంబ సభ్యులతో కలిసి సుమారు 18 వేల మంది ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. హోం మంత్రి అనిత.. శనివారం పోలీసు ఉన్నతాధికారులతో కలిసి పరేడ్ గ్రౌండ్‌లో చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. 72 అడుగుల విస్తీర్ణం కలిగిన సభా వేదిక నిర్మిస్తుండగా, ఆ ఏర్పాట్లను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉదయం ఎస్పీ వకుల్‌జిందాల్‌తో కలిసి పరిశీలించారు. డీజీపీ ఆఫీసు నుంచి బెటాలియన్ కమాండెంట్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్నారు.

## రూ.92 కోట్ల విలువైన నక్సల్ ఆస్తుల జప్తు

పోస్టాఫీసులు, మొబైల్ టవర్ల నిర్మాణం చేపట్టారు.

అది విషపూరితమైన పాము లాంటిది: షా

నక్సలిజం వల్ల అటు ఆయుధాలు చేతబూనినవారికి గానీ.. ఇటు భద్రతా సిబ్బందికి గానీ ఎలాంటి ప్రయోజనం లేదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించారు. నక్సలిజం విషపూరితమైన పాము వంటిదని, దాన్ని అంతం చేసిన తర్వాతే అభివృద్ధిలో కొత్త అధ్యాయం మొదలవుతుందని స్పష్టంచేశారు. వచ్చే ఐదేళ్లలో ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌ను దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన గిరిజన ప్రాంతంగా తీర్చిదిద్దాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలిపారు. జగదల్‌పుర్‌లోని ఇందిరా ప్రియదర్శి స్టేడియంలో నిర్వహించిన ‘బస్తర్ ఒలింపిక్స్ 2025’ ముగింపు కార్యక్రమంలో అమిత్ షా శనివారం పాల్గొని ప్రసంగించారు.

# మిరియాల వెంకట్రావుకు ఘన నివాళి




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 14)

జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ ఆధ్వర్యంలో కాపు కుల బ్రహ్మగా పేరు గావించిన స్వర్గీయ మిరియాల వెంకట్రావు జయంతి వేడుకల సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించి, వేదిక ద్వారా ప్రకాశం జిల్లా వాసిగా వారితో గల గత అనుభాలను ప్రతిఓక్కరు అందరితో కలిసి పంచుకొన్నారు. అనంతరం నవంబర్ 17న జరిగిన కాపువనభోజన మహోత్సవం కార్యక్రమం విజయవంతం సందర్భంగా అభినందన సభ ఏర్పాటు చేసి, వనభోజన కార్యక్రమానికి సహాయ, సహకారాలు అందించిన, ఆహ్వాన కమిటీ సభ్యులకు ప్రతి ఒక్కరిని దుశ్శాలుతో, మెమోంట్‌తో సత్కరించి, భోజన కార్యక్రమం నిర్వహించారు.

అభినందన సభకు అధ్యక్షత వహించిన కొక్కిరాల సంజీవకుమార్, ముఖ్య అతిథిగా హాజరైన మాజీ వుడా చైర్మన్ శింగరాజు మీనాకుమారి, మాజీ కార్పొరేటర్ తోటకూర వెంకట్రావు, మాజీ కార్పొరేటర్ పసుపులేటి శ్రీనివాసరావు, ప్రముఖ వ్యాపారవేత్త కొల్లా రఘునాథ్, కాపు మహిళా నాయకురాలు చెరుకూరి విజయలక్ష్మీ, ఏయంసి డైరెక్టర్ పప్పు శ్రీను, ఎంప్లాయిస్ సంఘం అధ్యక్షుడు నారపుశెట్టి రామ్మోహన్‌రావు, కాపు సంఘం లీగల్ అడ్వైజర్ అయినాబత్తిన గోపికృష్ణ, రిటైర్ ఎంప్లాయిస్ సంఘం అధ్యక్షుడు బూదె రామ్‌రాజ్ కుమార్, రిటైర్ కాలేజీ ప్రిన్సిపాల్ నరహరి సాంబయ్య మాట్లాడుతూ వనభోజనం కార్యక్రమం ఇంత విజయవంతం చేసిన అధ్యక్షుల వారికి, కమిటీ సభ్యులకు ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇలాగే అందరు ఐకమత్యంగా ఉంటే సాధించలేనిది ఏమీ లేదు. జరగబోయే కాపు సంఘం కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు భాగస్వాములై జయప్రదం చేయాలన్నారు. కాపు సంఘం పటిష్టంగా ఉంటే మనం ఏది కావాలన్నా సాధించుకోచ్చన్నారు. అందరూ కలిసి ఐకమత్యంతో ముందు ముందు మరెన్నో కార్యక్రమాలు చేసి కాపు సంఘం ప్రతిష్టను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కాపు సంఘం నాయకులు తంజావూరు శ్రీనివాసమూర్తి, ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు, వల్లంశెట్టి హనుమంతరావు, వాసాని అంకబాబు, లింగిశెట్టి సుబ్బారావు, మేకల నారాయణ, చింతపల్లి నారాయణ, శెట్టి పాపారావు, శెట్టి సుబ్రహ్మణ్యం, మేకల నరసింహారావు, చెన్నంశెట్టి శివ, రావెళ్ళ రాఘవ, అడుసుమల్లి వీరబ్రహ్మం, కూటకోళ్ళ శ్రీనివాసరావు, దమ్మాలపాటి పాపారావు, ఎన్‌యస్‌పి శేఖర్, తిరుమలకు సోమయ్య, యేండ్ల ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసి మానవత్వం చాటుకున్న హెచ్‌ఎం టివి రిపోర్టర్ బొజ్జ చంద్రమోహన్



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, డిసెంబర్ 14)

ఒంగోలులోని కిమ్స్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న ఒక పేషెంట్‌కి హార్ట్ సర్జరీ నిమిత్తం అత్యవసరంగా ఏబి పాజిటివ్ రక్తం అవసరం అని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న బ్లడ్ డోనర్స్ గ్రూప్ సభ్యుడు, కందుకూరు హెచ్‌ఎమ్ టీవీ రిపోర్టర్ బొజ్జ చంద్రమోహన్ వెంటనే స్పందించి కందుకూరు నుంచి ఒంగోలు వెళ్లి రక్తదానం చేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా అత్యవసర పరిస్థితుల్లో ఆదుకున్న చంద్రమోహన్‌కి పేషెంట్ తరపు బంధువులు కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. ఈ సందర్భంగా బొజ్జ చంద్రమోహన్ మాట్లాడుతూ ఏ దానాన్ని స్వీకరించాలన్నా ప్రాణం ఉండాలని అలాంటి ప్రాణాన్ని నిలబెట్టే రక్తదానం అన్ని దానాలలో కల్లా గొప్పదని ఆరోగ్యవంతమైన ప్రతి ఒక్కరూ రక్తదానం అలవాటుగా చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కందుకూరు రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్ చైర్మన్ చెన్నా వెంకట రామాంజనేయులు , మాట్లాడుతూ బొజ్జ చంద్రమోహన్ గారు రక్తం దొరక్క ఎవరు ఇబ్బంది పడకూడదు అనే ఆలోచనతో ప్రతి సంవత్సరం అంబేద్కర్ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తూ రక్తం అందక ఇబ్బంది పడే పేషెంట్లకు, తలసీమియా బాధితులకు అండగా నిలబడుతున్నారని, అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తూ ఎంతోమంది ప్రాణాలను కాపాడుతున్నారని అతని సేవలను కొనియాడారు.

షణ్ముఖ వెలుగు
ePaper www.shanmukhavelugu.com
3 | 14.12.25 సోమవారం

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక
ప్రకాశం

# ప్రజలకు మంచి చేయడమే క్రీస్తు మార్గం

**20 ఏళ్ల తరువాత సాగర్ కాల్వ పొలాలకు నీళ్లిచ్చాం**
**కులమతాల మధ్య గొడవలకు సైతానులు సిద్ధంగా ఉన్నారు**
**ప్రతి అవకాశాన్నీ ప్రజల మంచి కోసం వినియోగిస్తున్నాం**
**గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్**




**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, డిసెంబర్ 14)**

ప్రజలకు మంచి చేయడమే అసలైన క్రీస్తు మార్గమని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని కట్టక్రిందపాలెం సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చ్‌లో ఆదివారం జరిగిన గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో మంత్రి గొట్టిపాటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. నాగార్జున సాగర్ కాలువలను బాగుచేసి 20 సంవత్సరాల తరువాత సాగర్ కాలువ కింద ఉన్న పొలాలకు నీరు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదని తెలిపారు. క్రీస్తు మార్గాన్ని అనుసరించి ప్రజలకు మంచి చేయడానికి ఉన్న ప్రతి అవకాశాన్నీ వినియోగించుకుంటున్నామని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. కుల,మాతాల మధ్య గొడవలు సృష్టించేందుకు సైతానులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. స్వార్థ, రాజకీయ ప్రయోజనాల కోసం వచ్చే సైతానుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ప్రజలందరూ క్రిస్మస్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని సూచిస్తూ అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల కోరిక మేరకు అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలిపేందుకు అన్నీ ఏర్పాట్లు పూర్తయ్యాయని మంత్రి గొట్టిపాటి తెలిపారు. గత ఐదేళ్లలో అన్ని వ్యవస్థల్నీ ధ్వంసం చేసిన వైసీపీ నేతలు, గ్రామీణ ప్రాంతాల రోడ్లను కనీసం బాగు కూడా చేయించలేదని దుయ్యబట్టారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి అద్దంకి నియోజకవర్గ పరిధిలో మూడు సబ్ స్టేషన్లను నిర్మిస్తుండటంతో పాటు 2000 కొత్త స్థంబాలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ శాఖను ఆదాయ వనరుగా చూడవద్దని చెప్పిన మాటలను ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగాలో ఓల్టేజ్ సమస్యలు ఎదురు కాకుండా అవసరమైన అన్ని ప్రాంతాల్లోనూ సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా, పట్టణాలతో పోటీగా గ్రామీణ ప్రాంతాలలోనూ మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు.

**అబద్ధాల ప్రచారానికి సాక్షి...**

కులమాతలకు అతీతంగా కూటమి చేస్తున్న అభివృద్ధిని వైసీపీ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. అబద్ధాల ప్రచారానికే సాక్షి పత్రికను వినియోగిస్తున్నారని ఆయన మండి పడ్డారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని కూడా చెడుగా చూపడమే ధ్యేయంగా సాక్షి పత్రిక పని చేస్తుందని మంత్రి మండి పడ్డారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తొమ్మిదిసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచితే, కూటమి వచ్చిన తరువాత ట్రూ డౌన్ కింద 13 పైసలు తగ్గించిన విషయాన్ని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి గుర్తు చేశారు. వైసీపీ నేతలు చేస్తున్న విష ప్రచారం పట్ల ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. సూర్యఘర్ వంటి పథకాలతో అన్ని వర్గాలకూ ఎంతో మేలు జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతతృత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యుత్ రంగంలో ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చిందని వివరించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.





# వైసిపి స్టేట్ సెక్రటరీగా డాక్టర్ మిర్జా షంషీర్ అలీ బేగ్‌కు సత్కారం

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, డిసెంబర్ 14)**

రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా షేక్ షంషీర్ అలీబేగ్ ను ఆదివారం సాయంత్రం తన కార్యాలయంలో వైసిపి ఇంటలెక్చువల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి, ఆర్యవైశ్య అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మేడ బద్రీనాథ్ కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడా బద్రీనాథ్ మిత్రులు, మున్సిపల్ కౌన్సిలర్ చాటకొండ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



# సజావుగా సాగిన చీమకుర్తి సర్వసభ్య సమావేశం

**పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు**
**సంతనూతలపాడు నియోజకవర్గానికి**
**జెడ్పీ నిధుల నుండి వీలైనంత ఎక్కువ మొత్తాన్ని కేటాయిస్తాం**
**జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ**
**అందరూ సహకరిస్తే మండలంలో**
**మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేయవచ్చు**
**ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్**








**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిసెంబర్ 14)**

చీమకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం జరిగిన అత్యవసర సర్వసభ్య సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి స్థానిక ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం మండల పరిషత్‌లోని నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపాదనలు చేశారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన సభ కొనసాగింది. జడ్పిటిసి వేమా శ్రీనివాసరావు మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రస్తావించారు. వైస్ ఎంపీపీ జేష్ఠ శ్రీనివాసరావు పలు సమస్యల గురించి స్థానిక ఎమ్మెల్యే బి ఎం విజయ్ కుమార్ కు, జడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు వివరించగా వారు సానుకూలంగా స్పందించి త్వరలోనే పరిష్కార మార్గం చేస్తామని తెలిపారు. (తరువాయి 4లో...)

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న యువనేత కందుల విగ్నేష్‌రెడ్డి



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 14)**

తిరుమలలో వెలసిన కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి ని ఆదివారం ఉదయం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు యువనేత కందుల విగ్నేష్‌రెడ్డి దర్శించుకున్నారు. విదేశాల నుంచి శనివారం చెన్నై ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఆయనకు అభిమానులు, స్నేహితులు స్వాగతం పలికారు. అనంతరం ఆదివారం ఉదయం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి సన్నిధిలో స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.





## పిన్నెల్లి సోదరులపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేయడం మంచి పద్ధతి కాదు

### యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరే శ్యామల







(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, డిసెంబర్ 14)

పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి పై రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగంగా అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేయటం ఇది మంచి పద్ధతి కాదని ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరేశ్యామల మండిపడ్డారు. ఆదివారం హైదరాబాద్‌లో కూటమి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులు, అక్రమ అరెస్టులను ఖండిస్తూ కేపీహెచ్‌బీ టెంపుల్ బస్ స్టాప్ వద్ద శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే తాటిపర్తి మాట్లాడుతూ ఓటమి ప్రభుత్వం వైసిపి ఎమ్మెల్యేలు నాయకులపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేయించడం ప్రజాస్వామ్యబద్ధంగా మంచి పద్ధతి కాదన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన పోయి రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. కేవలం సీఎం చంద్రబాబు నాయుడు కుమారుడు లోకేష్ ప్రవేశపెట్టిన రెడ్‌బుక్ పరిపాలనే కొనసాగిస్తున్నారని, దానికి అధికారులు కొమ్ము కాస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, రాష్ట్ర అధికార ప్రతినిధులు కారుమూరి వెంకటరెడ్డి, ఆరే శ్యామల, రాష్ట్ర ఐటీ వింగ్ అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ గుడపురెడ్డి వీరశేఖర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు, నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, కొల్లి నాగేశ్వరరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, సోషల్ మీడియా సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

## సృజనశీలతకు పట్టం ఉత్సాహ భరితంగా శ్రీగిరి బాలవిహార్ శిక్షణ తరగతులు






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 14)

కథలెన్నో చెప్పేస్తాము, పాటలెన్నో పాడేస్తాము, ఆటలెన్నో ఆడేస్తాము అంటూ విద్యార్థులు తమ పోటీ తత్వాన్ని రుజువు చేస్తూ శ్రీగిరి బాలవిహార్ శిక్షణా తరగతులకు మరింత వన్నె తెస్తున్నారు. ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, చిన్మయ మిషన్ సంయుక్త నిర్వహణలో శ్రీగిరి దేవస్థానం గో క్షేత్ర భవన్‌లో ఆదివారం నిర్వహించిన బాలవిహార్ శిక్షణా కార్యక్రమం విద్యార్థులకు ఆటవిడుపుగా మారింది. ఆట, పాటల ద్వారా విద్యార్థులు ఊహాత్మక శక్తిని ప్రదర్శించి చక్కటి కథలను తెలియ చెప్పారు. పురాణ పాత్రల పేర్లను బోర్డు పై చక్కగా లిఖించారు. టీవీలకు సినిమాలకు సెల్ఫోన్లకు అంటుకుపోకుండా తమ కిష్టమైన ఆటపాటల ద్వారా క్రీడల ద్వారా కొత్త విషయాలను నేర్చుకోవాలనే ఆసక్తిని విద్యార్థులు ప్రదర్శించారు. రామాయణం పుస్తకంలోని చిత్రాలకు అందమైన రంగులు వేశారు. ఆటపాటల ద్వారా విద్యార్థులు విషయాలను తొందరగా గ్రహించగలుగుతారని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, చిన్మయా మిషన్ ప్రబోధకులు పవిత్ర చైతన్య వెల్లడించారు. బాలవిహార్ శిక్షణ తరగతుల పేరిట విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించడం, సనాతన ధర్మం భారతీయ సంస్కృతి సాంప్రదాయాల విశిష్టతను విద్యార్థులకు తెలియచెప్పడం జరిగింది. దేశం గర్వించే భావి భారత పౌరులుగా విద్యార్థులను తీర్చి దిద్దడం లక్ష్యంగా చిన్మయ మిషన్ తోడ్పాటుతో బాలవిహార్ శిక్షణా తరగతులకు శ్రీకారం చుట్టిన శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్, శ్రీ గిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, శ్రీగిరి ధర్మకర్తల మండలి ప్రతినిధులకు, చిన్మయ మిషన్ నిర్వాహకులకు పలువురు అభినందనలు తెలిపారు.

# సజావుగా సాగిన చీమకుర్తి సర్వసభ్య సమావేశం






జడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ సంతనూతలపాడు నియోజకవర్గానికి వీలైనంత ఎక్కువ నిధులు మంజూరు చేస్తామని , మండల పరిషత్ లోని నిధులే కాకుండా సమస్యల దృష్ట్యా జడ్పీ నిధులను కూడా కేటాయిస్తామని తెలియజేశారు. అందరూ సమిష్టిగా పనిచేసే మండలాభివృద్ధికి తోడ్పడాలని తెలియజేశారు. ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ మాట్లాడుతూ మండల పరిషత్ లో ఉన్న నిధులతో రూ.12.5 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపాదించామని, యువగళం సమయంలో మండల రైతుల ప్రధాన సమస్య అయినటువంటి కారుమంచి మేజర్ కాలువ యొక్క మరమ్మత్తు పనులను డిఎంఎఫ్ నిధుల ద్వారా రెండు కోట్ల 62 లక్షల తో త్వరలోనే ప్రారంభిస్తామని,ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి ఒక్క బాలికకు సైకిల్ అందజేసే కార్యక్రమం చేపడతామని, మర్రిచట్లపాలెం సమీపంలోగ్రానైట్ రవాణా వలన గతంలో పాడైపోయిన రోడ్లను కోటిన్నరతో మరమ్మత్తులు చేశామని, సాస్కి నిధుల ద్వారా నియోజకవర్గానికి 10 కోట్లు మంజూరు చేయగా, మండలానికి ఐదుకోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రతిపాదనలు చేశామని, త్వరలోనే రామతీర్థం నుండి రాజుపాలెం రోడ్డుకు 9 కోట్ల నిధులతో ఇరువైపులా నాణ్యమైన రోడ్డు, డివైడర్ మరియు డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేస్తామని, పార్టీలకతీతంగా అందరూ సహకరిస్తే మండలాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని తెలియజేశారు. అనంతరం మండలంలోని రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని వారి యొక్క సమస్యల గూర్చి చర్చించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు మద్దిపాడు ఏఎంసీ చైర్మన్ మన్నం రాజేశ్వరి ప్రసాద్, ఎంపీడీవో రాఘవేంద్ర, తహసీల్దార్ ఆర్ బ్రహ్మయ్య, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ చట్టాన్ని పథకంలాగా మార్చి నిర్వీర్యం చేసే చర్యలు మానుకోవాలి

### వ్యవసాయ కార్మిక సంఘం ప్రకాశం జిల్లా కమిటీ డిమాండ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 14)



దశాబ్దాలుగా చేసిన పోరాటాల ఫలితంగా మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం వచ్చిందని, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేసి ఒక స్కీంగా మార్చే కుట్రలను ఖండిస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ప్రకటించింది. ఆదివారం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు ఒక ప్రకటన విడుదల చేశారు. స్వాతంత్ర్యానంతరం వచ్చిన చట్టాలలో గ్రామీణ ప్రాంత ప్రజానీకానికి ఉపాధి హామీ చట్టం ఒక వరం లాంటిదని వారు అన్నారు. ఉపాధి హామీని చట్టంగా చేశారని అంటే పని గ్యారంటీగా కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా ఉంటుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పూజ్య బాపూజీ గ్రామీణ రోజూగర్ యోజన అని పేరు మార్చిందని తెలిపారు. పేరు మార్చడమే కాదనీ, పని గ్యారెంటీ అనే దాన్ని తొలగించారని, ఒక స్కీముగా మార్చి ప్రభుత్వం అమలు చేయొచ్చు చేయకపోవచ్చు అన్నట్లు బలహీనపరిచారని మండిపడ్డారు. గ్రామ సీమలు దేశ అభివృద్ధికి పట్టుగొమ్మలని, అందుకోసం ప్రభుత్వాలు కృషి చేయాలని చెప్పిన గాంధీ ఆశయాలను దృష్టిలో ఉంచుకొని ఈ చట్టాన్ని తెచ్చిన యూపీఏ ప్రభుత్వం ఆయన పేరు పెట్టారని తెలిపారు. పేదరిక నిర్మూలన, వలసల నివారణ, గ్రామీణ సమాజంలో నీటి వనరులు, ఆస్తులు సమకూర్చటం, పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం లాంటి ఉన్నతమైన లక్ష్యాలతో ఈ చట్టం ప్రారంభమైందని తెలిపారు. మొదట కేంద్ర బడ్జెట్లో 4 శాతం నిధులు ఈ చట్టానికి కేటాయించారని, మోడీ అధికారంలోకి వచ్చాక క్రమంగా దాన్ని నిర్వీర్యం చేస్తూ 1.3% కుదించారని అన్నారు. నిజంగా బాపూజీ మీద ప్రేమ ఉంటే ఆర్థికవేత్తలు కోరుతున్నట్లు ఏడాదికి కేంద్ర బడ్జెట్లో 2.5 లక్షల కోట్లు ఉపాధి హామీకి నిధులు కేటాయించాలని, 200 రోజులు పని, రోజు వేతనం 600కు పెంచాలని వారు డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక పట్టణాలకు వలస వస్తున్న పేదలకు పని కల్పించేలా పట్టణాలకు ఉపాధి హామీని విస్తరించాలని పేదలు కోరుతుంటే ప్రభుత్వం పట్టించుకోవట్లేదని అన్నారు. మరోవైపు పని ప్రదేశంలో రెండుసార్లు ఫోటోలు తీయాలని, రెండు పూటలా పనిచేయాలని, ఈకేవైసీ చేయించుకోవాలని రకరకాల సాకులు చూపి లక్షల మంది జాబ్ కార్డులు తొలగిస్తున్నారని, పనిచేసిన కూలీలకు నెలల తరబడి బకాయిలు చెల్లించకుండా వేధిస్తున్నారని అన్నారు. దేశం ఆర్థిక సంక్షోభం నుండి మెరుగుపడాలంటే గ్రామీణ పేదల కొనుగోలు శక్తి పెరిగితేనే సాధ్యమని, అందుకు ఉపాధి హామీ లాంటి చట్టాలను విస్తరించాలని కోరారు. చట్టాన్ని స్కీముగా మార్చే పద్ధతిని ఉపసంహరించుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండిగా పేదల పొట్ట కొట్టే చర్యకు పాల్పడితే ప్రజా ఉద్యమాల రుచి చూపిస్తామని వారు హెచ్చరించారు.

## టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 30 రోజులు తిరుప్పావై ప్రవచన యజ్ఞం




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 14)

టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో సంతపేట సాయిబాబా మందిరంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిర్వహించే ధనుర్మాస వేడుకల బ్రోచర్‌ను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు సతీమణి నాగసత్యలత, డిజిఆర్ ట్రస్ట్ డైరెక్టర్స్ తనూజాలక్ష్మి, అనీషాలక్ష్మి ఆవిష్కరించారు. సంతపేట సాయిబాబా మందిరం అధ్యక్షులు అలహరి చంచలరావు మాట్లాడుతూ 16వ తేదీ మధ్యాహ్నం నుంచి ధనుర్మాసం వచ్చిన సందర్భంగా 17వ తేదీ ఉదయం నుంచి తిరుప్పావై పాశురాలతో స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి మహిళా భక్త బృందంచే గోదాదేవి రచించిన తిరుప్పావై పాశురాల పారాయణ, 7 గంటల నుంచి టిటిడి అళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు వారు ఎన్నికచేసిన ఉపన్యాసకులు, స్వర్ణకంకణ గ్రహీత, బ్రహ్మశ్రీ పొన్నూరు వేంకట శ్రీనివాసులుచే తిరుప్పావై ప్రవచనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనవరి 14వ తేదీ భోగి రోజు వరకు 30 రోజులపాటు తిరుప్పావై పాశురాల ప్రవచనం, పారాయణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 30వ తేదీ ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారికి ఉత్తరద్వార దర్శనం, జనవరి 8వ తేదీ 24వ పాశురం సందర్భంగా దీపోత్సవం, 11వ తేదీ 27వ పాశురం సందర్భంగా కూడారై ఉత్సవం, 14వ తేదీ భోగి పండుగ సందర్భంగా గోదా శ్రీరంగనాథుల కళ్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంతపేట సాయిబాబా మందిరంలోని వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో తిరుప్పావై మహిళా భక్త బృందం అధ్యక్షురాలు దామచర్ల లక్ష్మి ప్రసన్నకుమారి, సాయి దుర్గ, నందిని, శుభశ్రీ, అనంతలక్ష్మి, లక్ష్మీ కుమారి, ప్రసూన, రమణ, శేషకుమారి, జయలక్ష్మి, సుజనశ్రీ, షకీలా, రమాదేవి, గీతాంజలి, తదితరులు పాల్గొన్నారు.



# సిఐటియు అఖిలభారత 18వ మహాసభల సందర్భంగా సిఐటియూ మండల కమిటీ ఆధ్వర్యంలో సదస్సు






షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిసెంబర్ 14)
సిఐటియు అఖిల భారత 18వ మహాసభల సందర్భంగా సిఐటియూ మండల కమిటీ ఆధ్వర్యంలో సదస్సు పంగులూరు కృష్ణయ్య భవనం వద్ద నుగ్గు శ్రీను అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ సిఐటియు అఖిల భారత 18వ మహాసభలు మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ లో విశాఖపట్నంలో జరగటం మన రాష్ట్రానికి గర్వకారణం స్వాతంత్ర ఉద్యమ వారసత్వంలో పుట్టి కార్మిక వర్గ ఆశయానికి అంకితమైనది సిఐటియు అని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రధాన కేంద్రమైన విశాఖ ఈ మహాసభకు వేదికగా దేశం నలుమూలల నుంచి కాకలదీరిన కార్మిక నాయకులు పాల్గొంటారు. దేశవ్యాప్తంగా యావత్తు కార్మిక వర్గాన్ని ఐక్యపరచడం సిఐటియు ఆశ యం కార్మిక కర్షక ఐక్యతతో పెట్టుబడిదారీ విధానాన్ని కూల్చి కార్మిక రాజ్యాన్ని స్థాపించడం సిఐటియు లక్ష్యం ఈ ఆశయ సాధన ద్వారానే కార్మిక వర్గం నేడు ఎదుర్కొంటున్న సర్వ సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. గత 11 సంవత్సరాల నుంచి కేంద్రంలోని బిజెపి మోడీ, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి ప్రజా వ్యతిరేక పాలన చేస్తున్నాయని బిజెపి హిందూ మతోన్మాదం రెచ్చగొట్టి ప్రజల్లో చీలికలు తెచ్చే పాలన సాగిస్తుందని రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తుందని పచ్చి కార్మిక వ్యతిరేక విధానాల్లో అమలు చేస్తుందని పెట్టుబడుదారుల దోపిడీకి అడ్డంగా ఉన్న కార్మిక చట్టాలు మార్చి నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చిందని విమర్శించారు వీటికి వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలకు ఈ మహాసభలు వేదిక కానందుని సందర్భంగా మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అటు కార్మిక వర్గ, రైతాంగం దోపిడీకి గురవుతున్నారనిప్రభుత్వం రంగం సంస్థ ప్రైవేటీకరించడం వ్యవసాయ రంగాన్ని ప్రైవేటీకరించడం ఈ విధానాలకు వ్యతిరేకంగా రాబోయే రోజులు కార్మిక కర్షక ఐక్యత పోరాటాలు నిర్మించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. సిఐటియు జిల్లా నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ డిసెంబర్ 15 న మహాసభలు జయప్రదం కోసం జెండా ఆవిష్కరణ వేయాలని ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ మండల నాయకులు జి అప్పల్ నాయుడు, కనకరాజు,తాళ్లూరు శ్రీను, ప్రభుదాసు, ఏడుకొండలు రైతు సంఘం మండల కార్యదర్శి బెజవాడ శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కంకణాల వెంకటేశ్వర్లు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సురేష్, రామారావు, కొండయ్య, వెంకటేశ్వర్లు, నరసింహారావు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలి

### మధు రిసర్చ్ ల్యాబ్ మాల్యాద్రి



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, డిసెంబర్ 14)
విజయ్ దివాస్ సందర్భంగా బద్వేల్ లో మెగా రక్తదాన శిబిరం అమర వీరుల త్యాగాలు వెలకట్టలేనివని, వీరి జ్ఞాపకార్థంగా విజయ దివాస్ రోజున, బద్వేల్ మాజీ సర్వీస్ మెన్స్, మధు రీసర్చ్ ల్యాబ్ వారి ఆధ్వర్యంలో 16వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటలకు అమర్ జవాన్ స్థూపం జడ్పీ బాయ్స్ హై స్కూల్ దగ్గర రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మనం చేయు రక్తదానం మరొక ప్రాణాలను కాపాడుతుంది. మనమందరం స్వచ్ఛందంగా పాల్గొని మరొకరికి ప్రాణదాతలు అవుదామని కోరారు.

## పండుగ వాతావరణంలో శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల తల్లిదండ్రుల సమావేశం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిసెంబర్ 14)
పట్టణంలోని స్థానిక శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో భారీ సంఖ్యలో సమావేశానికి హాజరయ్యారు. వారి యొక్క పిల్లల ప్రోగ్రెస్ రిపోర్టులు చూసుకొని మార్కులు తెలుసుకొని సంతృప్తిని వ్యక్తం చేస్తూ కళాశాల అభివృద్ధికి పలు సూచనలు సలహాలు చేశారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె వి రమణరెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి విద్యా వ్యవస్థను పొదిలిలో అందుబాటులోకి తెచ్చింది కేవలం శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల మాత్రమే అని తెలిపారు. డైరెక్టర్ వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి ప్రతి ఒక్క తల్లిదండ్రులు కూడా తమ యొక్క విలువైన సూచనలు సలహాలు అందించి మాకు సహకరించాలని కోరారు. రాబోయే రోజులలో విద్యార్థులకు డిజిటల్ విద్యా విధానానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లు మేడ కుమార్, భవనం శ్రీనివాస్ రెడ్డి, జి మహేష్, జి హేమంత్ కుమార్, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా 2024- 2025 బ్యాచ్ లో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన తల్లిదండ్రులను ఘనంగా షాలువాలతో సత్కరించి మెమెంటోను అధ్యాపకుల ద్వారా అందించారు.

## డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 14)
డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ వారి సహకారంతో ఆదివారం సంతపేట సాయిబాబా దేవస్థానం నందు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 1500 మందికి ఉచిత కంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు చేతుల మీదగా డీజేఆర్ ట్రస్ట్ వారి సహకారంతో అవసరం అయిన వారికి మందులు, ఉచిత కళ్లజోళ్లు ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ డీజేర్ ట్రస్ట్ పేదలకు సేవా చేయడానికి ఎప్పుడు ముందుంటుందన్నారు. ఈ శిబిరంలో చూయించుకున్న వారికి కంటి శుక్లాలు నిర్ధారించబడిన వాళ్ళకి ఎన్టీఆర్ వైద్యసేవ కార్డ్ ద్వారా ఉచిత కంటి ఆపరేషన్లు చేయబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగర్వాల్ హాస్పిటల్ తరపున డాక్టర్ సాయి యశ్వంత్, డా లక్ష్మీ శిరీష, వి జయకుమార్ రెడ్డి, బందారు మదన్, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.









## సూర్య శ్రీ ట్రస్ట్ చే జీవనోపాధికి టిఫిన్ బండి ఏర్పాటు

### పేదల జీవనోపాధికి సూర్య శ్రీ ట్రస్ట్ అండగా ఉంటుంది మండవ మురళీకృష్ణ




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 14)
సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ సెక్రెటరీ షేక్ సర్దార్ భాష ఆధ్వర్యంలో ఒంగోలు 60 అడుగుల రోడ్డు సత్యనారాయణపురంలో నివాసముంటున్న షహనాజ్ జీవనోపాధికి 98 ఫ్రెండ్స్ ఫౌండేషన్ సహకారంతో టిఫిన్ బండిని ఆదివారం సూర్య శ్రీ ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ ప్రారంభించారు. ట్రస్ట్ సెక్రెటరీ షేక్ సర్దార్ భాష మాట్లాడుతూ షహనాజ్ ఆర్థికంగా ఇబ్బంది పడుతుంది జీవనోపాధికి టిఫిన్ కు తోపుడుబండి ఏర్పాటు చేయమని, మా ట్రస్ట్‌ను ఆశ్రయించింది వెంటనే ఆమె జీవనోపాధికి దాతల సహకారంతో టిఫిన్ బండి ఏర్పాటు చేశామన్నారు. దీని ద్వారా ఆమె కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనోపాధి పొందాలని కోరారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల నుంచి సూర్య శ్రీ ట్రస్ట్ ఎంతో మంది పేదలకు జీవనోపాధికి పేద విద్యార్థులకు ఫీజులకు ఆర్థికంగా అండగా ఉందని తెలిపారు.

## రజియా ఫాతిమాను ఆశీర్వదించిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి




(షణ్ముఖ వెలుగు, బేస్తవారిపేట, డిసెంబర్ 14)
మండలంలోని నేకునాంబాద్ గ్రామంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు దూదేకుల దస్తగిరి మనవరాలు, ఖాసీం సాహెబ్ కరిష్మా కుమార్తె చిరంజీవి రజియా ఫాతిమా తలనీలాల కార్యక్రమానికి రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి, కొమరోలు మండల విద్యాశాఖ అధికారి బొర్రా వెంకటరత్నం, అర్ధవీడు మండల యుటిఎఫ్ అధ్యక్షులు ఇమ్మడి తిరుపతయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని రజియా ఫాతిమాను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా రజియా ఫాతిమా తాతయ్య దూదేకుల దస్తగిరి మాట్లాడుతూ మా మనవరాలు చిరంజీవి రజియా ఫాతిమా తలనీలాల కార్యక్రమానికి హాజరై ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ మంత్రి దగ్గుబాటికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టిడిపి రాష్ట్ర పరిశీలకులు శాసనాల వీరబ్రహ్మం



(షణ్ముఖ వెలుగు, హైదారాబాద్, డిసెంబర్ 14)
ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో టిడిపి రాష్ట్ర పరిశీలకులు శాసనాల వీరబ్రహ్మం మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ ధర్మో రక్షితి రక్షతః ట్రస్ట్ గౌరవ అధ్యక్షులుగా యక్కలి శేషగిరిరావు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిసెంబర్ 14)
శ్రీ ధర్మో రక్షితి రక్షతః ట్రస్ట్ గౌరవ అధ్యక్షులుగా పొదిలి గ్రామానికి చెందిన యక్కలి శేషగిరిరావు నియమితులయ్యారు. ఆదివారం విజయవాడలోని తాళ్ళాయపాలెం శైవక్షేత్రంలో ఆ నియామక పత్రాన్ని శివస్వామి చేతుల మీదుగా అందుకున్నారు.

## నేడు జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోదకుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 14)

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు అందజేసిన సమస్యల అర్జీల పై ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు అన్ని శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటుగా ప్రతి రెవెన్యూ డివిజన్‌లో మండల తహశీల్దార్లు కార్యాలయాల్లోను తహశీల్దార్లు, ఎంపీడిఓలు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. అర్జీదారులు అందజేసిన అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని, పిజిఆర్ఎస్ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరు కావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## క్రికెట్ పోటీలకు అవసరమైన డ్రెస్ మెటీరియల్‌ను స్పాన్సర్ చేసిన మేఘన హోటల్ అధినేత యాలం



(షణ్ముఖ వెలుగు, బేస్తవారిపేట, డిసెంబర్ 14)

ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలకు అవసరమైన కిట్‌లను మండలానికి చెందిన మేఘన హోటల్ అధినేత, టీడీపీ టౌన్ నాయకులు యాలం వెంకటేశ్వర్లు స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమానికి బేస్తవారిపేట మండల విద్యాశాఖ అధికారి యన్ మధుసూదనరెడ్డి, క్రికెట్ టీమ్ సభ్యులు హాజరు అయ్యారు. బేస్తవారిపేట మండలానికి చెందిన మేఘన హోటల్ అధినేత, టీడీపీ యువ నాయకులు యాలం వెంకటేశ్వర్లును మండల విద్యాశాఖ అధికారి, మండల ఉపాధ్యాయులతో కలిసి సన్మానించారు.

# పశ్చిమ ప్రకాశం చిరస్మరణీయుడు కందుల నాగార్జునరెడ్డి

## జయంతి సభలో వక్తలు








(షణ్ముఖ వెలుగు, బేస్తవారిపేట, డిసెంబర్ 14)

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పశ్చిమ ప్రాంతానికి చిరస్మరణీయుడు కంభం మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ కందుల నాగార్జున రెడ్డి అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం ఆయన జయంతి సందర్భంగా పలుచోట్ల ఆయనకు అభిమానులు, బంధు మిత్రులు ఘనంగా నివాళులర్పించారు. కంభం పట్టణంలోని వై జంక్షన్, బేస్తవారిపేట జంక్షన్ లోని ఫ్లైఓవర్, కలుజువ్వలపాడు వద్ద వున్న కందుల నాగార్జున రెడ్డి విగ్రహాలకు అభిమానులు, రాజకీయ నాయకులు, బంధుమిత్రులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వర్గీయ కందుల నాగార్జున రెడ్డి ఈ ప్రాంతానికి చేసిన సేవలను కొనియాడారు. అయన మార్కాపురం డివిజన్ ప్రజలకోసం కష్టపడ్డారని,ఈ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడ్డారని పార్టీలకతీతంగా అభిమానులు పాల్గొని కందుల సేవలను గుర్తు చేసుకున్నారు. వెలుగొండ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ఈ ప్రాంతంలో పాద యాత్రలు, గంజి యాత్రల ద్వారా ఈ ప్రాంత రైతాంగం బాగు పడాలంటే వెలుగొండ సాధించాలనే నినాదంతో పోరాటం చేశారన్నారు. నిస్వార్ధంగా ప్రజల కోసం శ్రమించారని, నీతి నిజాయితీలకు మారు పేరు స్వర్గీయ కందుల నాగార్జునరెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కంభం సర్పంచ్ పలనాటి బోడయ్య , మార్కాపురం జిల్లా సాధనసమితి అధ్యక్షులు దేవిరెడ్డి నాగేంద్రుడు, ఉపాధ్యక్షులు కాకర్ల ఆదినారాయణ రెడ్డి, ప్రచార కార్యదర్శి వాడపల్లి రమణ, మాజీ ఎంపీపీ రవి యాదవ్, విద్యావేత్త కంచర్ల తిరుపతయ్య గౌడ్, శర్మ, రామచంద్రా రెడ్డి, నరాల చెన్నారెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, అన్నెం ఇంద్రసేనారెడ్డి, గ్యాస్ శేఖర్, పల్లవ నారాయణ, చెన్న కృష్ణ, గుంటెయ్య, రమేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, కొండారెడ్డి, తదితరులు పాల్గొని ప్రజలకు అల్పాహారం అందజేశారు.



# వల్లూరు దేవాలయంలో పూజల్లో పాల్గొన్న తెలుగు మహిళ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షురాలు రావుల పద్మజ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 14)

తెలుగు మహిళ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షురాలు రావుల పద్మజ వల్లూరు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2024 ఎన్నికల్లో కూటమీ ప్రభుత్వం అధికారం చేపట్టి ఒంగోలు ఎమ్మెల్యేగా దామచర్ల జనార్దన్‌రావు గెలుపొందితే వల్లూరమ్మకి మొక్కు తీర్చుకుంటాను అని మొక్కుకున్న రావుల పద్మజ ఆదివారం వల్లూరమ్మతల్లికి ఆ మొక్కు చెల్లించుకుంది. ఈ పూజా కార్యక్రమంలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు ఆయన సతీమణి దామచర్ల నాగసత్యలత పాల్గొన్నారు. పూజ కార్యక్రమానికి హాజరైన వారికి రావుల పద్మజా ఆధ్వర్యంలో దేవాలయ ప్రాంగణంలో భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఉడా చైర్మన్ షేక్ రియాజ్, కమ్మ సంఘం అధ్యక్షులు మండవ మురళీకృష్ణ,బండారు మదన్, బోడపాటి వెంకట్, కొఠారి నాగేశ్వరరావు, గడ్డం ఆదినారాయణ, పాలపర్తి లక్ష్మీ నారాయణ, సిద్దిక్ (బబ్లు), టిడిపి మహిళా నాయకురాలు టి. అరుణ, ఆర్ల వెంకటరత్నం,పద్మ, లక్ష్మి, నరసమ్మతో పాటు ఒంగోలు నగరంలోని టిడిపి పార్టీ వివిధ విభాగాలకు చెందిన నాయకులు, మహిళ నాయకురాల్లు, పలువురు వ్యాపారస్తులు పాల్గొన్నారు.







# హెల్మెట్‌ను శిరోధార్యంగా భావించి ప్రమాదాల సమయంలో ప్రాణరక్షణ పొందండి

## జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 14)

రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది, రోడ్ సేఫ్టీ వారియర్స్ కలసి హెల్మెట్, రోడ్డు భద్రతా నియమాలపై ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ యొక్క ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ ఎక్కువ మంది తలకు గాయం కావడం వల్లే చనిపోతున్నారని, వాటి వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, హెల్మెట్ ధారణతో ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చని, కావున ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నియమ ,నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నుండి తమను తాము కాపాడుకోవాలని పోలీస్ అధికారులు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారికి రక్షణ కవచంలా హెల్మెట్ ఉంటుందన్నారు. కావున ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లు వాహనాలు నడపరాదని, అతివేగం, ట్రిపుల్ రైడింగ్,సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని హెచ్చరిస్తున్నారు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని, హెల్మెట్ ధరించటం ద్వారా మీ భద్రత , మీ కుటుంబం యొక్క ఆనందం గురించి ఆలోచించాలని అధికారులు తెలిపారు.







# రౌడీ షీటర్లందరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలి






(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిసెంబర్ 14)

ఉలవపాడు మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ రౌడీషీటర్స్‌ను ఆదివారం సత్ప్రవర్తనకు ఉలవపాడు పోలీస్ స్టేషన్లో ఎస్ఐ జి సుబ్బారావు ఎదుట హాజరపరిచారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రౌడీ షీటర్లు అందరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఎవరైనా రౌడీ సీటర్స్ సత్ప్రవర్తన కలిగి ఉండకపోయిన, ప్రజాశాంతికి ఎటువంటి ఇబ్బంది కలిగించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొనబడును. రౌడీ షీటర్స్ ఎవరైనా అక్రమ కార్యకలాపాలు చేసినట్లు ఉన్నట్లయితే ఆ రౌడీ షీటర్ యొక్క సమాచారాన్ని మాకు తెలియజేయాలన్నారు. సమాచారం తెలిపిన వారి యొక్క వివరములు గోప్యంగా ఉంచబడునని ఉలవపాడు ఎస్ఐ జి సుబ్బారావు తెలిపారు.



# మార్కాపురం జిల్లా ఏర్పాటుతో అభివృద్ధి పరుగులు

(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, డిసెంబర్ 14)

మార్కాపురం జిల్లా ఏర్పాటుతో అభివృద్ధి పరుగులు పెడుతుందని టిడిపి నేతలు తెలిపారు. ఆదివారం మండలంలోని మంగాపురం గ్రామంలో మార్కాపురం జిల్లాను ప్రకటించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లాను ప్రకటించి కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుందన్నారు. రాబోయే రోజుల్లో జిల్లా అభివృద్ధికి మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి విశేష కృషి చేస్తారని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్, గొట్లగట్టు సర్పంచ్ పెరికే సుఖ్‌దేవ్ (బూన్), కుందూరు కాశిరెడ్డి, కనకం నరసింహారావు, కాటం రాజు, అంకాల రోశయ్య, చెన్నారెడ్డి, బండి శ్రీనివాస్, రమణారెడ్డి, వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, సుబ్బారావు, బ్రహ్మారెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణా, మురళి, తదితరులు పాల్గొన్నారు.





# నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 14)

సోమవారం జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# దళిత నేత అరుణ్ దీప్‌కు అంబేద్కర్ విశిష్ట సేవా రత్న అవార్డు



(షణ్ముఖ వెలుగు, కంభం, డిసెంబర్ 14)

ఆదివారం గుంటూరు లో మాల మహాసభ మాల మహానాడు సంయుక్తంగా నిర్వహించిన మాలల ఆత్మీయ కలయిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మల్లెల వెంకటరావు అధ్యక్షతన గోళ్ళ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీలకతీతంగా జరిగింది. రాష్టంలో గత 18 సంవత్సరాల కాలంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు అంబేద్కర్ చిత్ర పటాలను ఉచితంగా అందిస్తున్నందుకు గానూ కంభం పట్టణ నివాసి దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యకులు అయిన అరుణ్ దీప్ చింతల కు మాజీ హోమ్ మినిష్టర్ మేకతోటి సుచరిత, ప్రస్థుత ఎస్సీ మాల కార్పోరేషన్ చైర్మన్ డా పి విజయ్ కుమార్ చేతుల మీదుగా డాక్టర్ అంబేద్కర్ విశిష్ట సేవా రత్న అవార్డు ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్టం నలుమూలల నుంచి అంబేద్కర్వాదులు భారీ ఎత్తున హాజరు అయ్యారు. అరుణ్ దీప్‌కు అవార్డు రావడం పట్ల పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

# శ్రీ జాంబవంత నగర్ నందు సిఐటియు అఖిలభారత మహాసభల విరాళాల సేకరణ




## కార్మికులకు అండ సిఐటియు జెండా

**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, డిసెంబర్ 14)**

స్థానిక 2వ వార్డ్, శ్రీ జాంబవంతనగర్ నందు డిసెంబర్ 31 తేదీ నుంచి జనవరి 4 తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు 18వ జాతీయ మహాసభలు జయప్రదంకై సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు)పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి విరాళాలు సేకరించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె నాగేంద్రబాబు మాట్లాడుతూ 2025 డిసెంబర్ 31 తేదీ నుంచి 2026 జనవరి 4 వరకు జాతీయ మహాసభలు విశాఖపట్నంలో జరగనున్నాయని, ఈ మహాసభలకు దేశ వ్యాప్తంగా 2 వేల మంది కార్మిక ప్రతినిధులు,10 దేశాల నుంచి కార్మిక సంఘాల నాయకులు హాజరు కానున్నారన్నారన్నారు. జనవరి 4 తేదీన లక్ష మందితో బహిరంగ సభ జరగనుందని తెలిపారు. డిసెంబర్ 27 నుంచి జనవరి 2 తేదీ వరకు సాంస్కృతిక ఉత్సవాలు జరగనున్నాయని తెలిపారు. సాంస్కృతిక ఉత్సవాలకు ప్రముఖ సినీ నటులు ప్రకాష్ రాజ్,సుద్దాల అశోక్ తేజ, సింగర్ మంగ్లీ మరి కొంతమంది సిని ప్రముఖులు హాజరు కానున్నారని తెలిపారు. బద్వేలు పట్టణంలో ఉన్న అన్ని వర్గాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జనవరి 4 తేదీన జరగనున్న బహిరంగ సభను, సాంస్కృతిక ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. మహాసభల్లో కార్మికులను బానిసలుగా చేసే లేబర్ కోడ్లు రద్దు కోసం, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ, కనీస వేతనం నెలకు రూ.26,000లు ఇవ్వాలని, స్కీం వర్కర్లను, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, డైలీవేజ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, బిల్డింగ్ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, బిల్డింగ్ కార్మికుల పెండింగ్ క్లైమ్‌లను పరిష్కరించాలని, హమాలీ, ఆటో, ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ తదితర అసంఘటిత రంగ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, విద్యా, వైద్యం ప్రభుత్వ రంగంలో కొనసాగించాలన్నారు. కనీస పెన్షన్ నెలకు రూ.9 వేలు ఇవ్వాలని, ఓపిఎస్‌ను అమలు చెయ్యాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చెయ్యాలని మహాసభల్లో తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. మహాసభల విజయవంతం కొరకు అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు, సహాయ, సహకారాలు అందించి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కమిటీ సభ్యులు దియ్యాలహరి, కాలువ శివకుమార్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్ షరీఫ్, ఉపాధ్యక్షులు పత్తూరు యువరాజు, మున్సిపల్ యూనియన్ ఉపాధ్యక్షులు గంటా శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



## ఒంగోలులో జరిగే అటల్ మోదీ-సుపరిపాలన బస్సు యాత్ర, మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 14)**

అటల్ ఆశయం మోదీతో సాధ్యం నినాదంతో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో జరగబోవు కార్యక్రమంలో బిజెపి జాతీయ, రాష్ట్ర నాయకులు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్, రాష్ట్ర 20 సూత్రాల అమలు పథకం చైర్మన్ లంకా దినకర్ జిల్లాలోని ఎన్డీఏ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, బిజెపి, టిడిపి, జనసేన నాయకులు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో ఎన్డీఏ కార్యకర్తలు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకి మార్కాపురం బిజెపి అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయం దోర్నాల బస్టాండ్ వద్ద నుండి వాహనాలు బయలుదేరుతాయని బిజెపి మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివి కృష్ణారావు ఓ ప్రకటనలో తెలిపారు.

## సుపరిపాలన యాత్రను విజయవంతం చేయండి

### మంత్రి గొట్టిపాటి రవికుమార్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 14)**

దార్శనిక నాయకులు, మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "అటల్–మోదీ సుపరిపాలన యాత్ర" ను జిల్లాలో విజయవంతం చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. ఈనెల 16వ తేదిన మంగళవారం బాపట్ల జిల్లాలో "అటల్–మోదీ సుపరిపాలన యాత్ర" బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల వద్ద కాంస్య విగ్రహ ఆవిష్కరణ మహెూత్సవం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని కూటమి నేతలు, కార్యకర్తలకు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

# బలమైన కమిటీల నిర్మాణం వలన పార్టీ ప్రజల పక్షాన పనిచేస్తుంది

### వైఎస్ఆర్సిపి నాయకులు వెల్లడి

### ఐదో వార్డ్ బృందావనంలో కమిటీ నిర్మాణాల సమావేశం



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, డిసెంబర్ 14)**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిర్మాణంలో భాగంగా ఈరోజు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గం కందుకూరు పట్టణంలోని 5వ వార్డు బృందావనం నందు వార్డ్ పార్టీ కమిటీ మరియు వివిధ విభాగాల అధ్యక్షులను, కమిటీలను ఎన్నుకోవడం జరిగినది. పార్టీ అన్ని విభాగాల బలమైన కమిటీల నిర్మాణంతోనే పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ఆర్సిపి నాయకులు అన్నారు. మున్సిపాలిటీ వార్డుల్లోని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు మహిళా సమస్యల పైన, యువత,నిరుద్యోగ సమస్య పైన,ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనార్టీ ప్రజల సమస్యలపై అధికార పార్టీని ప్రజల పక్షాన ప్రశ్నిస్తూ పరిష్కారానికి కృషి చేస్తుందని తెలిపారు . నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ నాయకత్వంలో పార్టీ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తున్నాము అని అన్నారు. మాజీ ముఖ్యమంత్రివర్యులు జగన్మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ,అభివృద్ధి రాజ్యాన్ని తిరిగి సాధించడానికి ఈ కమిటీలు కృషి చేస్తాయని తెలియజేశారు. ఐదో వార్డులో ఎన్నుకున్న కమిటీలను ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ ఆమోదం మేరకు త్వరలో ప్రకటించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు షేక్ రఫీ, గణేషం. గంగిరెడ్డి, ముప్పవరపు. కిషోర్,గేరా మనోహర్,చనమాల కోటేశ్వరరావు, సిహెచ్. కృష్ణారెడ్డి, రావులకొల్లు బ్రహ్మానందం, వల్లూరి కోటేశ్వరరావు, కట్టా శరత్, చనమాల వాసు, ఎలితోటి చెన్నయ్య, తలపనేని గోపి, ఎరమాల.నాగభూషణం, షేక్ రహీం, ఎడ్ల మాధవరెడ్డి, గేరా శివప్రసాదు, జిల్లెలమూడి కోటేశ్వరరావు, వై.తిరుపతి రెడ్డి, షేక్ అబ్దుల్ కలాం, అన్నవరపు బెనర్జీ, గేరా శ్రీహరి, లక్కాకుల నరసింహారావు, పాలూరి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com